ప్రజా విశ్వంభర V3 NEWS

మహాత్ముల అడుగుజాడల్లో నడవాలి

నేర ప్రవృత్తి, ఇతరులను ఇబ్బందులకు గురిచేసే తత్వాన్ని మార్చుకోవాలి:సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ



విశ్వంభర, సూర్యాపేట: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి , మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నరసింహ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ సత్యం, అహింస, ధర్మం అనే మార్గాలను అనుసరించి దేశ ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమంలో ఏకతాటిపై నడిపించి దేశని స్వతంత్రం తేవడంలో కీలకపాత్ర పోషించిన మహనీయుడని అన్నారు. ఆయన చూపిన సత్యం, అహింస మార్గాలు నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలను ఎస్పీ స్మరించుకున్నారు. "జై జవాన్ – జై కిసాన్" నినాదంతో దేశ రక్షణలో సైనికుల పాత్రను, దేశాభివృద్ధిలో రైతుల ప్రాధాన్యతను చాటిచెప్పారని అన్నారు. దేశ రక్షణ, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహానుభావులు చూపిన మంచి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎస్పీ సూచించారు. సమాజానికి ఇబ్బందులు కలిగించే నేర ప్రవృత్తి, ఇతరులను ఇబ్బందులకు గురిచేసే తత్వాన్ని విడనాడి, మంచి వ్యక్తిత్వంతో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహనుభావుల ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నారాయణరాజు, ప్రవీణ్ కుమార్, జానయ్య, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, క్లోజ్ టీం ఇన్స్పెక్టర్ నవీన్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, ట్రాన్స్పోర్ట్ ఆర్ఎస్ఐ సురేశ్, ఎస్సైలు సాయిరాం, అన్వర్, అశోక్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలే స్ఫూర్తి



విశ్వంభర , కోహెడ : కోహెడ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజు కమిటీ డైరెక్టర్ లతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సత్యం, అహింస, శాంతి సిద్ధాంతాలను స్మరించుకుంటూ గాంధీజీ ఆశయాలను కొనసాగించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గాదాసు రాజేందర్, శ్రీశైలం, మహేష్‌కుమార్, బిజుగు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కుంకుడుపాములలో ఘనంగా గాంధీ జయంతి



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కుంకుడుపాముల గ్రామంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ గొలుసుల సత్తయ్య యాదవ్, వార్డు మెంబర్ బెల్లి లింగయ్య యాదవ్, పంచాయతీ కార్యదర్శి శిరీష, అంగన్‌వాడీ టీచర్ విజయ లలిత, ఆశా వర్కర్ వసంతలతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గ్రామ అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా 'వీబీజీ రాంజీ' పథకం ప్రాముఖ్యతను, దానికి సంబంధించిన అంశాలను గ్రామస్తులకు వివరించి, గ్రామాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గాంధీ జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

రాబోయే ఆరు నెలలు ఎన్నికల సమరం..

బూత్ స్థాయి నుంచి క్షేత్రస్థాయిలో పనిచేయాలి : కిషన్‌రెడ్డి



విశ్వంభర, బర్కత్‌పుర : రాబోయే ఆరు నెలల్లో మూడు కీలక ఎన్నికలు జరగనున్నందున బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ బర్కత్‌పుర నగర కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు (ఫారం-18) కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, మూడు కార్పొరేషన్ల స్థానిక ఎన్నికలు, ఖైరతాబాద్ ఉప ఎన్నికలు రానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువతను మత్తు పదార్థాల నుంచి కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. నవంబర్ మొదటి వారంలో నిర్వహించనున్న భారీ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్‌లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించాలని, 4వ తేదీన కేంద్ర హోంమంత్రి అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి రానున్న నేపథ్యంలో భారీగా తరలిరావాలని కోరారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు ఫారం-18 ద్వారా పట్టభద్రుల ఓటరు నమోదు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

బోగారంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, బోగారం గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆవరణంలో శుక్రవారం రోజు మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత మార్గాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి, సంఘ బంధం అధ్యక్షురాలు, వీవో, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలన్నీ గాంధీజీ బాటలో : డాక్టర్ రియాజ్



విశ్వంభర, రవీంద్రభారతి :గాంధీజీ చూపిన శాంతి, అహింసా మార్గమే ప్రపంచానికి శరణ్యమని గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా తెలుగు భాషా చైతన్య సమితి, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, కుసుమధర్మన్న కళాపీఠం, పాలడుగు నాగయ్య కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సాహితీ కుటీరంలో జయంతి సభ నిర్వహించారు.సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, విమర్శకుడు రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ.. విద్యార్థులు గాంధీజీ క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ స్వదేశీ వస్తువుల వినియోగం, ఖాదీ ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారని గుర్తుచేశారు.ముఖ్య అతిథి డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. గాంధీజీ సత్యం, అహింసా సిద్ధాంతాలను జీవితాంతం ఆచరించారని అన్నారు. అంటరానితనం నిర్మూలన, హిందూ-ముస్లిం ఐక్యత, సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. విశిష్ట అతిథి కేసీ రాజు రాంప్రసాద్ మాట్లాడుతూ.. గాంధీజీతోపాటు లాల్ బహదూర్ శాస్త్రి కూడా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. నైతిక విలువలకు కట్టుబడి పనిచేసిన శాస్త్రి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గాంధీ, శాస్త్రి నైతిక విలువలు, సిద్ధాంతాలను ప్రజలు ఆచరిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమాన్ని బడేసాబ్ నిర్వహించగా ప్రముఖ కవి గంట మనోహర్‌రెడ్డి, పాలడుగు సరోజినీ దేవి, డాక్టర్ రాధాకుసుమ, గజవెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. 50 మందికిపైగా కవులు, రచయితలు పాల్గొని గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రిపై కవి సమ్మేళనం నిర్వహించారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గ్రామసభలు



విశ్వంభర, హైదరాబాద్ :గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. గ్రామాల అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించడమే లక్ష్యం గా గ్రామసభలు నిర్వహించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్ఫూర్తితో గ్రామాల్లో పండగ వాతావరణంలో గ్రామసభలు నిర్వహించారు. రంగురంగుల ముగ్గులతో గ్రామ పటాలను రూపొందించి రహదారులు, తాగునీటి వనరులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశుధ్య సదుపాయాలు, సాగునీటి వనరులు, ఇతర మౌలిక వసతులను అందులో పొందుపరిచారు. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వర్షపు నీటి సంరక్షణ, ఉపాధి, వ్యవసాయం, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లో ప్రజల సూచనలకు ప్రాధాన్యం ఇచ్చి, వివిధ శాఖల పథకాలను సమన్వయం చేసుకోవాలని నిర్ణయించారు. గ్రామసభల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు.

పంచాయతీ కార్యాలయానికి తాళం..గుడిలో గ్రామ సభ



విశ్వంభర, పరిగి : గాంధీ మహాత్ముడి ఫోటో సాక్షిగా, గాంధీ జయంతి నాడు ఉప సర్పంచ్, ఆరు గురు వార్డు మెంబర్లను అవమానపరిచి గుడి ఆవరణలో గ్రామ సభ నిర్వహించారంటూ మిట్టకోడూరు గ్రామ మెజార్టీ వార్డు సభ్యులు ఆవేధన వ్యక్తం చేశారు. పరిగి మండల మిట్టకోడూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించే గ్రామ సభ రచ్చకెక్కింది. గ్రామ ఉప సర్పంచ్ మల్లేష్, మరో ఆరుగురు వార్డు సభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాయంలో టెంట్ వేయించి గ్రామ సభ నిర్వహించాలనుకున్నారు. గ్రామ సర్పంచ్ మాణిక్యం పంచాయతీ కార్యాలయం వద్ద కాకుండా మాణిక్ ప్రభు గుడి ఆవరణలో గ్రామ సభ నిర్వహించాడు. గ్రామసభ గుడి ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కనీస సమాచారం ఇవ్వకుండా తూతూ మంత్రంగా గ్రామ సభ నిర్వహించారంటూ ఉప సర్పంచ్ మల్లేష్, ఆరుగురు వార్డు సభ్యులు ఆరోపించారు. పంచాయతీ కార్యాలయం వద్ద టెంట్ వేసి ఏర్పాటు చేస్తే తీరా చివరి నిమిషంలో గుడి వద్ద గ్రామ సభ మేమంతా లేకుండానే నిర్వహించడం ఎంత వరకు కరెక్టంటూ ప్రశ్నించారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు గ్రామ సభ కోసం వేసిన టెంట్ పోలీసులు పేకేయించడం పై గ్రామస్తులు తప్పుపడుతున్నారు. సర్పంచ్ హోదాలో ఉండి అందరిని కలుపుకోవాల్సింది పోయి ఉప సర్పంచ్, వార్డు మెంబర్లను పట్టించుకోకుండా ఒకే ఊరిలో గులాబీ పార్టీకి చెందిన వారే రెండు చోట్ల గ్రామ సభలు నిర్వహించడంపై చర్చనీయాంశంగా మారింది.

గ్రామాల అభివృద్ధినే దేశాభివృద్ధి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి



విశ్వంభర, కనగల్: దేశాభి వృద్ధి జరగాలంటే మొదట గ్రామాలు సమగ్ర అభివృద్ధి చెందాలనీ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహా త్మా గాంధీ జయంతి ని పురస్కరించుకొని మండ లం లోని తిమ్మన్నగూడెం వి బి జి రామ్ జి గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ మర్రి రాజేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మహాత్మా గాంధీ గారి ఆశయాలను కొనసాగించాలని, గ్రామాల అభివృద్ధికి గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి ప్రగతిని సాధించుకునే బాధ్యత కూలీలపై ఆధారపడి ఉందన్నారు. గ్రామాల అభివృద్ధిలో ముఖ్యంగా జల సంరక్షణ, ఫామ్ పాండ్, వరద కాలువలు, పండ్ల తోటలు, ఇంకుడు గుంతలు, భూగర్భ జలాలను పెంపొందించుకోవడం, ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలన్నారు.గ్రామాలలో అభివృద్ధి పనులను గుర్తించడం తోపాటు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలన్నారు. గ్రామంలో ఉన్న పనులను గ్రామంలో ఉన్న కూలీలు పను లు చేసుకుంటూ వేతనాలు పొందాలన్నారు. మీ ఊరు మీ అభివృద్ధి లో గ్రామంలో ఉన్న కూలీలే భాగస్వాములు కావాలి అని వివరించారు.గ్రామంలో పంట కుంట పనులను ప్రారంభించారు. ఇది ఇలా ఉంటే 31 గ్రామపంచాయతీలలో వివిజి రా మీ జి గ్రామ సభలను ఆయా గ్రామాల సర్పంచులు కార్యదర్శులు నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో సర్పంచులు నర్సింగ్ మురళీధర్ గౌడ్, సురేష్, ముత్తయ్య, కొండ రవళి, కన్నెబోయిన సైదులు,నాగమణి, ఇతర గ్రామాల సర్పంచులు, ఏపీఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శిలు వీరబాబు, మజూర్ ,నర్సిరెడ్డి, దాసరి సైదులు, క్రాంతి,సుహాసిని, ఎఫ్ ఎ యాదయ్య, మహిళా సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్



విశ్వంభర, మంగళహాట్ :డ్రై డే నిబంధనల అమలులో భాగంగా హైదరాబాద్ మంగళహాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ బెల్ట్ షాపులపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, మొత్తం 50.01 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక నిఘా, అందిన సమాచారంతో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వారి నివాసాలపై పోలీసులు దాడులు చేశారు. రాహుల్ సింగ్ నుంచి 5.48 లీటర్లు, ఓం ప్రకాశ్ సింగ్ నుంచి 25.56 లీటర్లు, అశోక్ సింగ్ నుంచి 9.12 లీటర్లు, సురేష్ సింగ్ నుంచి 5.85 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరో కేసులో అశోక్ సింగ్ నుంచి 9.12 లీటర్ల మద్యం (35 బాటిళ్లు) స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. డ్రై డే నిబంధనలను ఉల్లంఘిస్తూ లైసెన్సులు లేకుండా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న వారిపై మొత్తం ఐదు వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళహాట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ, సిబ్బంది పర్యవేక్షణలో ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

టీయూడబ్ల్యూజే ఐజేయు మండల అధ్యక్షుడు సుంకిరెడ్డి జగాల్ రెడ్డి..

జర్నలిస్టుల ర్యాలీ, గాంధీ విగ్రహానికి వినతిపత్రం..



కనగల్ విశ్వంభర న్యూస్: టీయూ డబ్ల్యూజే-ఐజేయూ పిలుపు మేరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం శుక్ర వారం కనగల్ లో జర్నలి స్టులు ర్యాలీ నిర్వ హించారు. అనంతరం గాంధీ జ యంతిని పురస్కరించు కుని కనగల్ చౌరస్తాలో మహాత్మా గాంధీ విగ్ర హం వద్దకు ర్యాలీగా చేరుకున్న జర్నలిస్టులు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహాత్మా గాంధీ విగ్రహానికి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జగాల్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం, భద్రతకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వారు కోరారు.జర్నలిస్టులకు సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయడం, జర్నలిస్టులు మరియు మీడియా సంస్థల భద్రత కోసం ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తీసుకురావడం, వర్కింగ్ జర్నలిస్టులకు చట్టబద్ధమైన రక్షణలను పునరుద్ధరించడం, మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయడం వంటి ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.అలాగే అర్హులైన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మల్లేపల్లి నరసింహ, మహేశ్వరం రమేష్ కుమార్, నవీన్ రెడ్డి, కోశాధికారి రాయల సునీల్ కుమార్, జర్నలిస్టులు పాలకూర లింగస్వామి, టీ .నాగయ్య, మాచర్ల లక్ష్మీనారాయణ, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడిలో భక్తుల పూజలు



విశ్వంభర, కనగల్: మండలంలోని ధర్వేశిపురం స్టేజి వద్ద శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. అమ్మవారికి భక్తులు కుంకుమార్చన అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయం ముందు ఉన్న శివుని విగ్రహానికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మరి కొంతమంది భక్తులు కోరిన కోరికలు నెరవేరాలని కోరుతూ ముడుపులు కట్టి మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులు బోనాలతో వచ్చి దప్పు చప్పులు నడుమ ఆలయ ప్రదక్షిణలు చేపట్టి అమ్మవారికి ఇష్టమైన బోనమును నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉంటే ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.కార్యక్రమంలో అర్చక స్వాములు మల్లాచారి, దామోదర్ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలతో సమసమాజ నిర్మాణానికి కృషి



విశ్వంభర, ముషీరాబాద్ : మహాత్మా గాంధీ చూపిన అహింస, సత్యం, ప్రజాస్వామ్య మార్గం లో సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నల్లెల్ల కిషోర్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ తెలుగు దేశం పార్టీ నగర పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ ప్రజాసేవకు కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.కె. బోసు, పరుశురామ్, శ్యామ్‌సుందర్, తడక వినోద్, కరణం కరణ్, భాను ప్రకాష్, ఎస్. ప్రకాష్, సాయి కిరణ్, మచ్చేంధర్, సత్తన్న, ఆనంద్ పాల్గొన్నారు.

ఆటో సంఘాల నేతలకు విందు ఎందుకు?

విశ్వంభర, హైదరాబాద్ :ఆటో డ్రైవర్లకు న్యాయం చేయకుండా సంఘాల నాయకులకు విందు ఇవ్వడాన్ని ఎలా సమర్థిస్తారని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ప్రశ్నించింది. నేడు ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇవ్వనున్న విందును బీఎంఎస్ వ్యతిరేకించింది. ఆటో మీటర్ ఛార్జీలపై ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని పేర్కొంది. తొలి 1.6 కిలోమీటర్లకు రూ.30, ఆ తర్వాత కిలోమీటరుకు రూ.14 గా ప్రతిపాదించిన ఛార్జీలు డ్రైవర్ల ఖర్చులకు సరిపోవని తెలిపింది. సంఘాలతో చర్చించి న్యాయమైన ఛార్జీలు నిర్ణయించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా మూడు రోజులపాటు ఆందోళనలు చేపట్టాలని, కనీస ఛార్జీగా రూ.50 వసూలు చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు రవిశంకర్ అల్లూరి, సి.హెచ్. నంద కిషోర్, బి. పెంటయ్య గౌడ్, కె. శ్రీధర్ రెడ్డి తెలిపారు.